కస్టడీలో నిందితుడి మృతి!

- పోలీసులు కొట్టడమే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ
- నిజామాబాద్‌లో ప్రభుత్వ జిల్లా దవాఖాన ఎదుట ఆందోళన
- గుండె పోటుతోనే మరణించాడని పోలీస్ కమిషనర్ ప్రకటన
- మృతుడు సంపత్ శరీరంపై బలమైన గాయాలు ఉన్నాయి,
- సిట్టింగ్ జడ్జితో విచారించాలి: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

సంపత్‌ను పోలీసులే కొట్టి చంపారని ఆరోపిస్తూ నిజామాబాద్‌లోని జీజీహెచ్ ఎదుట ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు, చిత్రంలో మోహరించిన పోలీసులు

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ)/వినాయకనగర్: నిజామాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల కస్టడీలో ఓ నిందితుడు గురువారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం వివాదంగా మారింది. పోలీసులు కొట్టడంవల్లే నిందితుడు చనిపోయాడని ఆరోపిస్తూ మృతుడి కుటుంబ సభ్యులు శుక్రవారం ప్రభుత్వ జిల్లా దవాఖాన ముందు ఆందోళనకు దిగారు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దపల్లి జిల్లా అంతర్గాంకు చెందిన సంపత్ (32) జగిత్యాల జిల్లాలో మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీ ద్వారా నిరుద్యోగులను థాయ్‌లాండ్, మయన్మార్, లావోస్ తదితర దేశాలకు పంపిచాడు. విదేశాలకు వెళ్లిన యువకులు తాము మోసపోయామని తిరిగి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిజామాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు సంపత్‌తో పాటు మరో ఏజెంట్‌పై పదిరోజుల క్రితం కేసు నమోదుచేశారు. ఇద్దరినీ అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా కోర్టు రిమాండ్ విధించింది. నిందితులను విచారించేందుకు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు పిటిషన్ దాఖలు చేయడంతో ఈ నెల 12 నుంచి 14 వరకు మూడు రోజుల కస్టడీకి కోర్టు అనుమతించింది. నిందితులను సైబర్‌క్రైమ్ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. దర్యాప్తులో భాగంగా గురువారం జగిత్యాలలో సంపత్ కన్సల్టెన్సీ ఆఫీసుకు తీసుకెళ్లారు. లావాదేవీలు, రికార్డులను పరిశీలించారు. రాత్రి నిజామాబాద్ సీసీఎస్‌కు తరలించారు.

స్టేషన్ లాకప్‌లో ఏమైంది?

గురువారం రాత్రి 10 గంటలకు ఛాతిలో నొప్పిగా ఉన్నదని, చేయి లాగుతున్నదని సంపత్ తెలిపాడని పోలీసులు చెప్తున్నారు. హుటాహుటిన జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించగా, సంపత్ చికిత్స పొందుతూ కాసేపటికే మృతి చెందినట్టు తెలిపారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్టు వెల్లడించారు. శుక్రవారం ఉదయం నిజామాబాద్‌కు చేరుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు దవాఖాన ఎదుట బైఠాయించారు. పోలీసులు తీవ్రంగా కొట్టడంతోనే సంపత్ మృతి చెందాడని ఆరోపించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి అక్కడకు చేరుకుని కుటుంబ సభ్యులతో చర్చించారు. అనుమానముంటే ఫిర్యాదు చేయాలని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

అనారోగ్యంతోనే మృతి

పోలీస్ కస్టడీలో సంపత్ అనారోగ్యంతోనే మరణించాడని నిజామాబాద్ సీపీ సాయిచైతన్య ఓ ప్రకటనలో వెల్లడించారు. దవాఖాన లోపలికి సంపత్ నడచుకుంటూ వెళ్లాడని, ఆ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యాయని తెలిపారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఘటనపై మానవ హక్కుల కమిషన్‌కు నివేదిక అందించామని వివరించారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి: జాన్‌వెస్లీ

పోలీసు కస్టడీలో నిందితుడు సంపత్ మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నిష్పక్షపాతంగా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వానికి జాన్‌వెస్లీ లేఖ రాశారు. పోలీసులు చిత్రహింసలు పెట్టడంతోనే అతడు చనిపోయాడని, సంపత్ శరీరంపై తీవ్రమైన గాయాలు ఉన్నాయని జాన్‌వెస్లీ చెప్పారు.

ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు అనుమతించాలి

- టీటీడీకి బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు సూచన

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): తిరుమలలో శ్రీవారి దర్శనానికి తెలంగాణకు చెందిన ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను అనుమతించాలని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. శుక్రవారం వీఐపీ బ్రేక్ సమయంలో ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు పంపుతున్న సిఫార్సు లెటర్లను ఫిబ్రవరి 1 నుంచి అనుమతిస్తామని బోర్డులో తీర్మానం చేసినట్టు గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 294 మంది ఎమ్మెల్యేలు పంపిన సిఫార్సు లేఖలను పరిగణనలోకి తీసుకుని వసతి కల్పించడంతోపాటు, బ్రేక్ దర్శనానికి అనుమతి ఇచ్చారని చెప్పారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్యేలకు పరిమితం చేయడం ఏంటని ప్రశ్నించారు.

'సీతారామ భూసేకరణ'ను పూర్తిచేయాలి

- ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలి
- అధికారులకు నీటి పారుదల మంత్రి ఉత్తమ్ ఆదేశాలు

హైదరాబాద్, మార్చి14 (నమస్తే తెలంగాణ): సీతారామ ప్రాజెక్టుకు భూసేకరణను త్వరితగతిన పూర్తిచేయాలని, ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలని సంబంధిత అధికారులను సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. ప్రాజెక్ట్ పనుల పురోగతిపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి మంత్రి ఉత్తమ్ చర్చించారు. సత్తుపల్లి ట్రంక్, సీతారామ ప్రాజెక్ట్ పురోగతి, భూసేకరణ, ఖర్చు, నాణ్యత, భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించారు. సత్తుపల్లి ట్రంక్ పనులు, పంప్‌హౌస్-4 నిర్మాణాన్ని ఈ ఏడాదిలో పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రాజెక్ట్ పనుల్లో సమస్యలు ఎదురైతే వెంటనే సమాచారం అందించాలని, సీతమ్మసాగర్ బరాజ్ నిర్మాణాన్ని రాబోయే మూడేళ్లలో పూర్తిచేయాలని సూచించారు.

చేనేతలకు లక్షలోపే రుణమాఫీ!

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో చేనేత కార్మికులకు రుణమాఫీ చేస్తున్నామని, అందుకోసం రూ.33 కోట్లు విడుదల చేశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించారు. ఈ నెల 9న హైదరాబాద్‌లో నిర్వహించిన అఖిల భారత పద్మశాలీ సంఘం మహాసభలో పాల్గొన్న ఆయన, ఈ మేరకు ప్రకటన చేసిన విషయం తెలిసిందే. 2017 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 మధ్యకాలంలో రుణం పొందిన వారికి మాత్రమే మాఫీ జరిగినట్టు జీవోలో పేర్కొన్నారు. దీంతో చేనేత, పవర్‌లూమ్ కార్మికుల్లో కలవరం మొదలైంది. రూ.లక్ష లోపు వారికి మాత్రమే రుణమాఫీ చేస్తే, లక్ష దాటిన వారి పరిస్థితి ఏమిటని సర్కారును నిలదీస్తున్నారు. రూ.లక్షకు ఒక్క రూపాయి ఎక్కువైనా రుణమాఫీ చేయడం లేదని చేనేత కార్మిక సంఘాల నాయకులు గగ్గోలు పెడుతున్నారు. బ్యాంకర్లు కూడా ఇదే విషయం చెబుతున్నట్టు పేర్కొంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 30 వేల మందికిపైగా చేనేత కార్మికులు వివిధ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోగా, అధికారంలోకి రాగానే రుణాలు మాఫీ చేస్తామని ఎన్నికల ముందు చెప్పిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చి సుమారు 15 నెలల పాటు ఆలస్యం చేసింది. దీంతో బ్యాంకుల ఒత్తిడికి కొంతమంది చేనేత కార్మికులు తలొగ్గి బయట అప్పులు చేసి రుణాలు తీర్చారు. ఇక మిగిలిన వారికి మాత్రమే ఇప్పుడు రుణమాఫీ వర్తిస్తున్నట్టు చెబుతుండడంతో రుణాలు చెల్లించిన వారి పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. అసలు రుణమాఫీ బ్యాంకుల నుంచి పొందిన అసలుకా? వడ్డీతో కలిపి మొత్తానికి చేస్తారా అనేది తెలియాల్సి ఉందని పేర్కొంటున్నారు. రుణమాఫీకి సంబంధించిన అంశాలపై క్లారిటీ ఇవ్వాలని, అందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు చెరుకు స్వామి, పవర్‌లూమ్ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు కూరపాటి రమేశ్ డిమాండ్ చేస్తున్నారు.

జూలైలో పంచాయతీ ఎన్నికలు జరిగేనా?

- నేటికీ కొలిక్కి రాని బీసీలకు 42 శాతం రిజర్వేషన్
- 2024 ఫిబ్రవరి 1న ముగిసిన పాలకవర్గాల గడువు
- నిబంధనల ప్రకారం ఇప్పటికే 14 నెలలు ఆలస్యం
- సకాలంలో ఎన్నికలు జరుగక నిలిచిన కేంద్ర నిధులు

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు జూలైలో అయినా జరుగుతాయా అనే అనుమానం కలుగుతున్నది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించింది. అధికారంలోకి వచ్చి 15 నెలలైనా రిజర్వేషన్ల ప్రక్రియను రేవంత్ సర్కారు కొలిక్కి తీసుకురాలేకపోయింది. సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన వివిధ అభివృద్ధి నిధులు నిలిచిపోయాయి. ఫలితంగా గ్రామీణ సంక్షేమానికి తీవ్ర విఘాతం కలుగుతున్నది.

గ్రామాల్లో నిధుల కొరత..

రాష్ట్రంలో గ్రామపంచాయతీలు, మండల, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ పాలకవర్గాల పదవీకాలం ఇప్పటికే ముగిసింది. నిరుడు ఫిబ్రవరి 1న సర్పంచుల పదవీకాలం ముగిసింది. ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నది. ఆర్టికల్ 243ఈ(3)ప్రకారం.. ప్రతి ఐదేండ్లకు ఒకసారి పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి. గ్రామపంచాయతీ పాలకవర్గం గడువు ముగిసేలోపు లేదా పాలకవర్గం రద్దయిన ఆరు నెలల్లో ఎన్నికలు పూర్తిచేయాలి. కానీ, గ్రామపంచాయతీల పాలకవర్గాల గడువు ముగిసి 14 నెలలు కావస్తున్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించలేదు. సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడంపై కేంద్ర పంచాయతీరాజ్ వ్యవహారాలకు సంబంధించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తాజాగా ఆందోళన వ్యక్తంచేసింది. ఎన్నికల ఆలస్యంతో గ్రామాభివృద్ధి ప్రాజెక్టులు, కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు నిలిచిపోయాయని తెలిపింది.

బీసీల రిజర్వేషన్‌పై మల్లగుల్లాలు

కులగణన నిర్వహించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టో ప్రకటించింది. ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం కుల సర్వే నిర్వహించింది. గణాంకాలను అసెంబ్లీలో ప్రకటించింది. 3.1 శాతం(16 లక్షల) జనాభా సర్వేలో పాల్గొనలేదని వెల్లడించింది. సర్వే గణాంకాలపై ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్‌తోపాటు బీజేపీ, ప్రజాసంఘాలు, కుల సంఘాలు, మేధావులు తీవ్ర అభ్యంతరాలు తెలిపారు. రీ సర్వేకు డిమాండ్ చేశారు. దీంతో సర్కారు ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు మళ్లీ కులగణన వివరాల నమోదుకు అవకాశం కల్పించింది. 15 వేల లోపు కుటుంబాల వివరాలు మాత్రమే సేకరించగలిగింది. ఈ గణాంకాలపై ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో చర్చించనున్నట్టు ప్రభుత్వం తెలిపింది. అప్పుడే 42 శాతం రిజర్వేషన్లపై బిల్లు పెడతామని, పార్లమెంట్‌లో ఆమోదం కోసం పంపిస్తామని చేతులు దులుపుకున్నది.

ప్రభుత్వ కార్యాలయం నుంచి ఫైళ్ల తరలింపు

సెలవు రోజు రాత్రి వేళ సీనియర్ అసిస్టెంట్ నిర్వాకం

ములుగు, మార్చి 14 (నమస్తేతెలంగాణ): ప్రభుత్వ కార్యాలయం నుంచి గుట్టు చప్పుడు కాకుండా రాత్రి సమయంలో ఫైళ్లను తరలించిన ఘటన ములుగు జిల్లా కేంద్రంలోని పే అండ్ అకౌంట్స్ కార్యాలయంలో శుక్రవారం చోటుచేసుకున్నది. ములుగు పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న జిల్లా సంక్షేమ శాఖ అధికారి కార్యాలయ కాంప్లెక్స్‌లో ఉన్న పే అండ్ అకౌంట్స్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శుక్రవారం రాత్రి తన కారులో వచ్చి అటెండర్‌తోపాటు మరో ఇద్దరు వ్యక్తుల సహాయంతో సుమారు 30కి పైగా ఫైళ్లను ఆఫీసు బయటకు తీసుకొచ్చారు. రోడ్డుపై తెల్లటి క్లాత్‌లో కట్టి కారులో ఎక్కిస్తుండగా అటుగా వెళ్లిన 'నమస్తే తెలంగాణ' ఫైళ్ల తరలింపుపై ప్రశ్నించింది. ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్ సార్ ఉన్నారని, ఆయన ఆదేశాల మేరకే కారులో పెడుతున్నట్టు అటెండర్ తెలిపాడు. సదరు అధికారి వద్దకు వెళ్లి వివరణ కోరగా తమకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని, మార్చి నెలలో ఆడిటింగ్ ఉన్నందున ఫైళ్లను ములుగులోని తన గదికి తీసుకెళ్తున్నట్టు చెప్పారు. హోలీ పండుగ సెలవు రోజున, అదీ రాత్రి వేళ ఎందుకు ఫైళ్లను తరలిస్తున్నారని అడిగితే దాటవేసే ప్రయత్నం చేశారు. సంబంధిత కార్యాలయ జిల్లా అధికారి సమక్షంలో ఫైళ్లను తరలించాల్సి ఉండగా అటెండర్ సహాయంతో తరలించడం పలు అనుమానాలకు తావిస్తున్నది.

ములుగు పే అండ్ అకౌంట్స్ ఆఫీస్ నుంచి రాత్రి 8 గంటలకు ఫైళ్లను తరలిస్తున్న అటెండర్, మరో ఇద్దరు వ్యక్తులు

మయన్మార్ సైబర్ రాకెట్‌లో 8 మంది సభ్యుల అరెస్టు

సీఎస్‌బీ డీజీ శిఖా గోయెల్ వెల్లడి

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): మయన్మార్ సైబర్ నేరగాళ్ల ముఠాలోని మొత్తం 15 మంది ఏజెంట్లు, మధ్యవర్తుల్లో 8 మందిని అరెస్టు చేసినట్టు సీఎస్‌బీ డీజీ శిఖా గోయెల్ ఓ ప్రకటనలో వెల్లడించారు. మిగిలినవారు పరారీలో ఉన్నారని, వారిలో ఐదుగురు విదేశాల్లో ఉన్నారని వివరించారు. తెలంగాణ వ్యాప్తంగా 10 మంది బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ఈ ముఠాపై 9 కేసులు నమోదైనట్టు తెలిపారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి

గర్శకుర్తి వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర, మార్చి 14: భారతదేశ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని గర్శకుర్తి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, ఉప్పరమల్యాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయం బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యేకు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, వేంకటేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ కల్వకోట శ్రీనివాసరావు, నాయకులు కర్ర శ్రీనివాస్‌రెడ్డి, బొల్లాడి శ్రీనివాస్‌రెడ్డి, పోకల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి బాలుడి దుర్మరణం

ఇల్లందకుంట, మార్చి 14 : మండల కేంద్రంలో బైక్ అదుపు తప్పిన ఘటనలో ఓ బాలుడు దుర్మరణం చెందాడు. ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన అనుదీప్ (15) శుక్రవారం హోలీ సందర్భంగా బైక్‌పై ఇల్లందకుంట మండలం చిన్నకోమటిపల్లి గ్రామానికి చెందిన తన స్నేహితుడి ఇంటికి వెళ్లాడు. అదే రోజు సాయంత్రం కొత్తపల్లికి బైక్‌పై తిరిగి వస్తుండగా, ఇల్లందకుంట చెరువు కట్ట వద్ద వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొన్నది. బైక్ పైనుంచి అనుదీప్ కింద పడిపోగా, పక్కనే ఉన్న బండ అతడి తలపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అనుదీప్ తండ్రి ఎం.భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నాగరాజు శర్మకు జ్యోతిష్య చక్రవర్తి అవార్డు

అవార్డు అందుకున్న నాగరాజు శర్మ

కమాన్‌చౌరస్తా, మార్చి 14 : కరీంనగర్‌కు చెందిన డాక్టర్ ఆవునూరి నాగరాజు శర్మ శుక్రవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ఉగాది పురస్కారోత్సవంలో భాగంగా జ్యోతిష్య చక్రవర్తిగా అవార్డు అందుకున్నారు. విశ్రాంత డీజీపీ సీఎన్ గోపీనాథ్ రెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి, సినీ నటుడు సుమన్ నాగరాజు శర్మకు అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

తెలంగాణ చౌక్, మార్చి 14 : నేటి నుంచి ఒంటిపూట బడులు ప్రారంభంకానున్నట్లు జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో జిల్లాలోని పాఠశాలలో ఒకపూట బడులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నేటి నుంచి వచ్చే నెల 23 వరకు ఉద యం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు. అలాగే పదో తరగతి పరీక్షా కేంద్రాలుగా ఉన్న పాఠశాలలో మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు కొనసాగుతాయని వెల్లడించారు.

ముంచుకొస్తున్న ముప్పు

ఎండల మూలంగా రాష్ట్రంలో తాగు, సాగునీటి సమస్య ముందుగానే మొదలైంది. దీనిని పరిష్కరించాల్సిన ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తుండడంపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. వేసవికి ముందు ఏటా చేపట్టినట్లుగానే ఈసారి కూడా జిల్లాలోని బోర్లు, చేతిపంపులు, మోటర్ల మరమ్మతుల కోసం అవసరమయ్యే నిధుల మొత్తానికి సంబంధించిన ప్రతిపాదనలు రూపొందించిన అధికారులు వాటిని ప్రభుత్వానికి పంపి, రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదని తెలుస్తుండగా, జిల్లా వ్యాప్తంగా ప్రజానీకం నీటికోసం తిప్పలు పడుతున్నది.

- కానరాని నిధుల విధిలింపు
- ప్రతిపాదనలు పంపినా స్పందన ఏది?
- మార్చిలోనే మండుతున్న ఎండలు
- తాగునీటికి తప్పని తిప్పలు
- పంపులు, బోర్ల మరమ్మతులకు మోక్షమెప్పుడో?

నగరంలోని పాత కూరగాయల మార్కెట్ సమీపంలో మరమ్మతులకు నోచుకోని చేతిపంపు

కలెక్టరేట్, మార్చి 14 : జిల్లాలో 2,632 హ్యాండ్ బోర్లుండగా, వీటిలో సుమారు 500, సింగల్ ఫేజ్ బోరు మోటర్లు 1771 ఉండగా ఇందులో 300 వరకు, ఓపెన్ వెల్ మోటర్లు 350 ఉంటే వీటిలో 30 వరకు పనిచేయడం లేదని అధికారుల ద్వారా తెలుస్తున్నది. వీటి మరమ్మతుల కోసం రూ.41.86 లక్షలు అవసరమవుతాయనే అంచనాలతో నివేదికలు పంపారు. ఈసారి ముందుగానే ఎండలు దంచికొడుతుండగా, శరవేగంగా భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం సత్వరమే స్పందించి, అధికారుల ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేయాల్సి ఉండగా పట్టించుకోకపోవడంతో, గ్రామీణ నీటి సరఫరా విభాగం యంత్రాంగంలో ఆందోళన మొదలైంది.

పట్టింపులేని సర్కారు

వాస్తవానికి వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళికలు రూపొందించి, జనవరి నెల నుంచే అవసరమైన చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం అధికారులను అప్రమత్తం చేయాల్సి ఉంటుంది. అధికారులే ముందస్తుగా మరమ్మతుల కోసం ప్రతిపాదనలు రూపొందించి నివేదించినా, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదనే ఆరోపణలు వస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో అటు అధికారులు, ఇటు ప్రభుత్వంపై ప్రజానీకం తీవ్రస్థాయిలో మండిపడుతున్నది. పంచాయతీల్లో పాలకవర్గాలు కొనసాగిన సందర్భాల్లో ఆయా గ్రామాల సర్పంచులు బాధ్యతలు తీసుకుని, నీటి సరఫరాపై దృష్టి సారించేవారు. అవసరమైన మరమ్మతులకు కూడా సొంతంగా నిధులు వెచ్చించి బడ్జెట్ విడుదలైన అనంతరం తిరిగి తీసుకునేవారు. పాలకవర్గాల పదవీకాలం ముగియడం, తిరిగి ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రస్తుతం పంచాయతీలన్నీ ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. అధికారులు తమ జేబుల్లో నుంచి ఖర్చు పెట్టి, మరమ్మతులు చేపట్టే అవకాశాలు లేకపోగా, వేసవి ఆరంభంలోనే గ్రామాలోల నీటి ఎద్దడి తీవ్రమవుతున్నదని గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే, ఈనెలాఖరులోపే ప్రజలు ఖాళీ బిందెలతో వీధుల్లో కొచ్చే ఆస్కారమున్నదనేది సుస్పష్టం.

అందరినోట అదే మాట

జిల్లాలో రోజురోజుకూ నీటి ఎద్దడి తీవ్రమవుతున్న నేపథ్యంలో, తెలంగాణలో తొలి పాలన చేపట్టిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని జిల్లావాసులు గుర్తు చేస్తున్నారు. కేసీఆర్ హయాంలో తాగు, సాగునీటికి ఢోకా లేకుండా ఉండేదనే వ్యాఖ్యలు అందరి నోళ్లలో నుంచి వస్తున్నాయి. ఉమ్మడి పాలనలో తెలంగాణలో ప్రజలనుభవించిన నీటి కష్టాలను గుర్తించిన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, వాటిని తొలగించేందుకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. ప్రాజెక్టుల నిర్మాణంతో గోదావరి జలాలను ఉత్తరం నుంచి దక్షిణానికి తరలించి, చరిత్రపుటల్లో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు. తాగునీటి కోసం గ్రామాల్లో నీటి వనరుల నిర్వహణ కోసం అవసరమైన నిధులను ప్రతి ఏటా డిసెంబర్‌లోనే విడుదల చేసేవారు. దీంతో, వేసవికి ముందే నీటి ఎద్దడి నివారణ చర్యలతో, అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండేది. ఫలితంగా గత దశాబ్ద కాలంలో జిల్లాలోని గ్రామాల్లో ఏనాడు కూడా తాగు నీటి సమస్య ఉత్పన్నం కాలేదనే అభిప్రాయాలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి.

జిల్లాస్థాయి యువోత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ

కలెక్టరేట్ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కొత్తపల్లి, మార్చి 14 : నెహ్రూ యువ కేంద్రం కరీంనగర్ ఆధ్వర్యంలో ఈనెల 19న నిర్వహించనున్న జిల్లాస్థాయి యువోత్సవ్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ జిల్లాస్థాయి యువోత్సవ్‌లో యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. యువోత్సవంలో కవిత్వం, చిత్రలేఖనం, డిక్లమేషన్, మొబైల్ ఫొటోగ్రఫీ, సైన్స్‌మేళా, కల్చరల్ డాన్స్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి వెంకట్ రాంబాబు, అధికారులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి సస్పెన్షన్ అప్రజాస్వామికం

ముస్తాబాద్, మార్చి 14 : ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలపై అసెంబ్లీలో బీఆర్‌ఎస్ మాట్లాడినందుకు మాజీ మంత్రి జగదీశ్ రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని బీఆర్‌ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బీ సురేందర్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు విషయాలపై నాయకులు చర్చించారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలను మభ్య పెట్టి, గెలిచిన కాంగ్రెస్ పార్టీ.. హామీలను గాలికి వదిలేసి, ప్రజలను ఆగం చేస్తున్నదని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి, ఉమ్మడి జిల్లా మాజీ కో ఆప్షన్ మెంబర్ సర్వర్ పాషా, కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎం మనోహర్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు మల్లేశం, భరత్, అన్వర్, శీలం స్వామి, కోడె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ రాజ్యాంగ విరుద్ధం

- కరీంనగర్‌లో బీఆర్‌ఎస్ నిరసన
- సీఎం దిష్టిబొమ్మ దహనానికి యత్నం
- అడ్డుకున్న పోలీసులు

కార్పొరేషన్, మార్చి 14: రాజ్యాంగానికి విరుద్ధంగా శాసనసభ నుంచి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడం అన్యాయమంటూ శుక్రవారం స్థానిక తెలంగాణ చౌక్‌లో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఇందులో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనానికి బీఆర్‌ఎస్ నాయకులు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో వారి మధ్య తోపులాట జరిగింది. అనంతరం బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పొన్నం అనిల్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అణచివేసే కార్యక్రమాలు చేపడుతున్నదని విమర్శించారు. సమస్యలను నిలదీయడమే తప్పు అన్నట్లుగా సస్పెండ్ ఉందన్నారు. తాము ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం పోలీసుల ద్వారా అడ్డుకొని నిరంకుశంగా వ్యవహరిస్తున్నదన్నారు. ఇలాంటి పాలకులకు ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ, శాసనసభ నుంచి జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచి అణచివేత ధోరణితో వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు చంద్రశేఖర్, షౌకత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం

కలెక్టరేట్, మార్చి 14 : రైతుల సంక్షేమమే తమ ధ్యేయమంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వారి క్షేమాన్ని విస్మరించి పాలన సాగిస్తున్నదని తెలంగాణ రైతుల పరిరక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మాందాడి వెంకటేశ్వర్లు ఆరోపించారు. శుక్రవారం నగరంలోని ఆసంఘం జిల్లా కార్యాలయంలో జరిగిన ఉత్తర తెలంగాణ రైతు ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి 20శాతం నిధులు కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న రైతు రుణమాఫీ సత్వరమే పూర్తిస్థాయిలో చేయాలని, రైతు భరోసా వెంటనే విడుదల చేయాలని, వాణిజ్య పంటలైన పత్తి, మిర్చి, మక్కలకు కూడా క్వింటాల్‌కు వెయ్యి రూపాయల చొప్పున బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు రాగుల రాఘవరెడ్డి, రఘునాయకుల మహేందర్‌రెడ్డి, చల్లగొండ మనోహర్‌రావు, దీకొండ వెంకటేశ్వర్‌రావు, ముత్తినేని ఆగంరావు, మెన్నేని సత్యంరావు, ఆకుల వీరయ్య, కోల రమేశ్, రాములు, కత్తెర వీరేశం, జున్నూతల రాజయ్య, బొలిశెట్టి రాములు, శివానందం, వీరయ్యతో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

కరెంట్ మోటర్ చోరీ

శంకరపట్నం, మార్చి 14: మండలంలోని మొలంగూర్ శివారులో కరెంట్ మోటర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. కన్నాపూర్ గ్రామానికి చెందిన నాయిని శ్రీనివాస్ అనే రైతు మొలంగూర్ శివారులోని వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నాడు. ఎస్సారెస్పీ ఉప కాలువకు కరెంట్ మోటర్‌ను బిగించుకుని పొలం సాగు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా కరెంట్ మోటర్ మాయం అయింది. రాత్రి పూట గుర్తు తెలియని దుండగులు కరెంట్ మోటర్‌ను అపహరించారని బాధిత రైతు వాపోయాడు.

తేనెటీల దాడిలో నలుగురికి తీవ్రగాయాలు

శంకరపట్నం, మార్చి 14: మోటార్ బైక్‌లపై వెళ్తున్న వారిపై మార్గమధ్యంలో తేనెటీగలు చేసిన దాడిలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. తాడికల్ గ్రామానికి చెందిన దుబ్బాక నర్సయ్య, అతడి భార్య రజిత, కుమార్తె సమ్మెట శ్రీజ, అల్లుడు సమ్మెట మహేందర్ కలిసి రెండు బైక్‌లపై నల్లగొండ జాతరకు బయలుదేరారు. మార్గమధ్యంలో గట్టుదుద్దెనపల్లి కాలువ వద్ద ఒక్కసారిగా తేనెటీగల గుంపు బైక్‌పై వెళ్తున్న వారిపై దాడి చేసింది. ఈ ఘటనలో నర్సయ్య, మహేందర్‌కు తీవ్ర గాయాలు కాగా, రజిత, శ్రీజకు స్వల్ప గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ప్రయాణికులు 108కి సమాచారం ఇవ్వడంతో ఈఎంటీ గూడూరి సతీశ్‌రెడ్డి, పైలట్ నర్రా సదన్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని, గాయపడిన వారిని అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స అందిస్తూ హుజూరాబాద్ దవాఖానకు తరలించినట్లు తెలిపారు.